

# కమల

అల్లం రాజయ్య

కిష్టయ్య ఇంటి వెనుక గల చేదబావి నీళ్లు చేదుకొని ముఖం మీద చల్లుకున్నాడు. భుజం మీది పంచెతో ముఖం మాత్రం తుడుచుకొని నీళ్లుకారే కాళ్లతో వంటింటి గుమ్మంలో నిలబడి, "కమలక్కా! ఓ కమలక్కా," అంటూ కేక వేశాడు.

"ఏం కిష్టయ్య లావు ఉరుకులాడి పిలుత్తన్నవ్!" కాళ్లకు గల వెండి పట్టగొలుసులు గలగలలాడుతుండగా గడపలో కొస్తూ కమల.

"ఇయ్యల్ల పొలం (అడివికి) పొమ్మన్నడు," కిష్టయ్య ఆదరబాదరగా ఇంట్లోకి చొరబోయాడు.

"ఔగని - నేను నీకన్న పెద్దదాన్నా-చిన్నదాన్నా?"

"నాకేమెరుక?"

"ఔ ఏలు బెడితే కరుకవు ఎన్నబెడితే నాకవు."

"ఎహ్హాహె," కిష్టయ్య కడుపు కదిలేలాగ నవ్వాడు.

"పోనీ నేను నీకేం వరుస."

"నాకేమెరుక?"

కిష్టయ్య నెత్తి గోక్కున్నాడు. అట్లా తీరుబాటుగా మాట్లాడే సమయం లేనట్టు మూతిబెట్టి, "ఓ కమలక్క జెరంత బువ్వుంటె బెట్టు- ఊరు పెట్టుబోవాలె. తొవ్వ మంచిగ లేదు. ఎవలనన్న ఎంట తీసుకపోదామంటె మంచె కావల్లాయె (చేలకు కావలి కాసే రోజులు) నన్నొక్కనే పొమ్మన్నడు."

"మల్ల గదేమాట- కమలక్క లేదు బొల్లికుక్క లేదు. ఆవల తెల్లారలేదు. ఈవల వండివార్సి పెట్టిన్నను కుంటన్నవా?" కమల కిష్టయ్య ముఖం మీద చేతులాడించింది.

ఈ చిక్కు సమస్య తీరేదెట్లా? కిష్టయ్య అడ్డదిడ్డంగా పెరిగిన తల, గడ్డం గోక్కున్నాడు. బజారులో పెద్ద బండ్లు వెళుతున్న చప్పుడు విన్పించింది. బొలబొల కేకలు విన్పించాయి. ఎవడో కొడుకును యథాలాపంగా తిడుతున్నాడు. నెత్తి రుమాలు మర్సిపోయినవని మరొక స్త్రీ గొంతు చెపుతోంది.

"మరైతే ఇయ్యల్ల బువ్వ బాకీలేదు. ఈరాధి ఈరుడు ధరిని కొమారుడు," తనను తాను ఉత్సాహ పరుచుకోవడానికి పాట రాగం, పాడు లేకుండా పాడుతూ బయటకు పరుగెత్తబోయాడు.

రాత్రి తాలూకు విసుగు మటుమాయమయ్యి కమల పెదవులు విచ్చుకున్నాయి. వెనువెంటనే కిష్టయ్యను తరిమేసినందుకు మనసు చివుక్కుమనిపించింది. అప్పటికే కిష్టయ్య గొంతు బజారులో విన్పిస్తోంది.

"ఓ కిష్టయ్యా," కమల పిలిచింది.

"ఏంది కమలక్కా," అంగిలేని ఒళ్లు ఊగుతుండగా పరుగెత్తుకొచ్చాడు.

"పరిగడుపున కట్టెలు కొడ్తావా? నీ మెదట్ల పెండున్నదా?"

"నాకేమెరుక?"

"సెత్త బెంచినవ్ గని..."

"నా ఈపు బలగ్గొడుతడు. నేను బోవాలె!" కిష్టయ్యకు ఈ సంభాషణ రుచించలేదు. అతనికి తెలిసిందల్లా ఎద్దులా పనిచేయడం. మొద్దులాగా నిదురబోవడం.

కమలకు భర్త జ్ఞాపకం వచ్చి చెప్పరానిదేదో ఒళ్లంతా పాకినట్టయి వికారం కలిగింది.

ఇదేదో తనకు సంబంధం లేని వ్యవహారమన్నట్లు కిష్టయ్య పోబోయాడు.

"ఇదెక్కడి పీడ తెస్తివి ఎద్దుకెద్దయినవ్ పెండ్లన్న చేసుకోరాదు. యాల్లకు ఇంత కూడన్న వండి పెడ్తది."

"నాకెవలిత్తరు పిల్లను. పటేలత్తె లగ్గం నాగెల్లి ఏకం జేత్తడు."

కమల లోపలికి వెళ్లి రాత్రి మిగిలిన అన్నం తెచ్చి కిష్టయ్య ముందు బెట్టింది. కిష్టయ్య వంటింటి గుమ్మం పక్క కాళ్లమీద కూర్చుండి పెద్ద పెద్ద ముద్దలు చేసి గోదురుకప్పలా నోరు తెరిచి నోట్లో దోపుకున్నాడు. కమల లోగింటి మండువా దగ్గర నిలబడి ఆశ్చర్యం గానూ, నవ్వుతూను చూసింది.

కిష్టయ్య ఓ పెద్ద చెంబెడు నీళ్లు 'గురుక్కు గురుక్కు'మని తాగి బయటకు పరుగెత్తాడు.

కమల కిష్టయ్య పరుగెత్తిన వేపే చూస్తూ నిలు చున్నది. కొసా మొదలు లేని అనేక ఆలోచనలు ముసురుకున్నాయి. ఎప్పుడూ ముసిరేవే- విసుగు కలి గించేవి, అసహ్యం కలిగించేవి- ఒక్కొక్కసారి దుఃఖం కలిగించేవి. కమలకు అప్పుడప్పుడు మెరుపులా ఊపిరి ఆగిపోయేంతవరకు ఎటో జొన్నచేలకు అడ్డంబడి పరుగెత్తాలని- బిగ్గరగా గయ్యిమని ఏడువాలని- అచ్చం కిష్టయ్యలాగే ప్రవర్తించాలని... ఇలాంటివే-

కమలకు కిష్టయ్య మామ వరుస. కమల ఈ ఇంటికి కోడలుగా రాకముందే కిష్టయ్య ఈ ఇంట్లో పాలేరుగా ప్రవేశించాడు. కిష్టయ్య వయసు కమలకన్నా అయిదు సంవత్సరాలే ఎక్కువ. కిష్టయ్యకు ఈ భూ ప్రపంచంలో నా అన్నవాళ్లెవరూ లేరు. కిష్టయ్యకు తండ్రి గుర్తులేడు. సంవత్సరపు వయసు పిలగానప్పుడే పాము కరిచి చనిపోయాడు. కిష్టయ్య లేగల మేపుతున్న వయసులో అతని తల్లిని పెడరెక్కలు విరిచి కట్టేసి మూడు బజార్లు కలిసేచోట ఊరిపెద్దలు కొలువుదీరి వుండగా- ఊళ్లోని మందంతా చూస్తుండగా చింత బరిగె లతో రక్తం కారుతుండగా- ఆమె ఒల్లు సొంతం పికిలి పోయేలాగున కొట్టారు. ఆమె కాళ్లను చుట్టేసిన కిష్టయ్య తను ఆ బరిగె దెబ్బలు తిన్నాడే కాని అతని పెనుగు లాట, రోదన తల్లిని రక్షించలేకపోయాయి... అక్కడే మట్టిలో అనంతమైన కోపంతో, బాధతో మూలిగి సొమ్మ సిల్లిన తల్లిపక్క కిష్టయ్య ఎండిచారికలు గట్టిన కన్నీళ్లతో కూర్చున్నాడు. ఆ తరువాత ఆ తల్లి పిచ్చిదయింది. ఊరి వాళ్లందరిని తిడుతూ, ఇండ్లమీద మట్టిబోస్తూ తిరిగేది.

తన తల్లి ఏమి చేసిందో? అప్పటికి ఇప్పటికి కిష్టయ్యకు అర్థంకాలేదు. కాని అందరూ ఎవరితోనో 'కడుపు చేసుకున్నది' అనేవాళ్లు. అది తప్పో! ఒప్పో! నిజమో! అబద్ధమో! అతను నిర్ణయించలేకపోయాడు. అంతరాంతరాలల్లో ఎక్కడో ఆ వూళ్లో ప్రచారంలో వున్న నీతి నియమాల మీద కిష్టయ్యకు నమ్మకంలేదు. అంతా దాని అసలు రూపంలో అర్థమయ్యేది. గ్రామం యావత్తూ తన తల్లి మీద, తన మీద ప్రయోగించిన దారుణ హింసాకాండ అతని మనసులో అతని వయసుతోపాటు ఎదుగుతూ వచ్చింది. అయితే ఆ పరా భవంతో కుమిలిపోనూ లేదు. తనకు తాను కాదు గ్రామం దృష్టిలో కూడా ఆ జ్ఞాపకమే లేనట్టుగా ప్రవ ర్తించేవాడు. మామూలు వ్యవహారాలకు ఎడంగా వుంటూ వచ్చాడు. ఏది ఏమైతేమి గ్రామం రీతి రివాజు లో తన వయసు వాళ్లందరిలాగా మెదలని కిష్టయ్యను అందరు 'ఎడ్డోడు' అనుకున్నారు.

తల్లి ఊళ్ల మీద బడి ఎటో వెళ్లిపోయింది. అప్పుడు కిష్టయ్యకు ఏడెనిమిదికన్నా ఎక్కువ వయస్సు లేదు. ఒక సంవత్సరం కిష్టయ్య దిక్కు తోచకుండా బతికాడు. ఎవరన్న పెడితే తిన్నాడు. ఎక్కడ బడితే అక్కడ నిదురబోయాడు. ఎండా, వానా, చలి వీటన్నిటికి తోడు దారితెన్నూ దొరకని దిగులుతో గడిపాడు. అలాంటి అనాథను వీరనారాయణ చేరదీశాడు. అప్పటి నుండి కిష్టయ్య పాలేరు. వీరనారాయణ పాతబట్టలు, అతనింట్లో పెట్టే తిండి, పని... ఇవే అతని వ్యాపకా లయ్యాయి. అతని అంతరంగంలోని భిన్న ప్రపంచం ఊరికి అవసరం లేదు.

వీరనారాయణ మొదటి పెళ్లి అట్టహాసంగా జరిగింది. వీరనారాయణ తండ్రి ఆ ఊళ్లో పేద రైతు. వీరనారాయణ చిన్నాయిన ఒకడు ఆ వూళ్లోని ఒక పెద్దింటికి ఇల్లరికం వెళ్లాడు. అతనికి సంతానం కలుగ లేదు. చిన్నాయిన ఎందుకనో ఉరిబోసుకుని చనిపో యాడు. పెద్దింటాయన బిడ్డ ముండమోసింది. ఎందు చేతనో పెద్దింటాయిన ఒక్కగానొక్క బిడ్డకు మళ్లీ పెళ్లి చేయలేదు. కాని వీరనారాయణను సాదుకం తెచ్చు కున్నాడు. వీరనారాయణకు పన్నెండు సంవత్సరాల వయస్సులోనే తన తాహతుకు తగిన సంబంధం తెచ్చి పెద్దింటాయన పెళ్లి చేశాడు. వీరనారాయణ యాభై ఎకరాల తరి నూటా నలభై ఎకరాల కుష్కి పది నాగళ్ల చేతను అజమాయిషీ చేసే జ్ఞానం వొచ్చేసరికి పెద్దింటి తాతకు, తనకు బిడ్డనిచ్చిన మామకు తగాదా వచ్చి భార్య చాలాకాలం పుట్టింటిలోనే వుండిపోయింది. ఆ తగువు అట్లా సంవత్సరాల తరబడి సాగుతుండగానే తాత చనిపోయాడు. అప్పటికే వీరనారాయణకు ఆ ఇంటి అలవాట్లన్నీ ఒంటబట్టాయి. తాటికల్లుతో పాటు వీరనారాయణ అన్ని నిషాలకు అలవాటులోకి ఎదిగిపో యాడు. పిన్నమ్మ చాటుమాటు వ్యవహారం వీరనారా యణకు తెలుసు. వీరనారాయణ పైలాపచ్చీ తిరుగు తుండగానే వీరనారాయణ భార్య మేనబావతో కాపురం బెట్టింది.

గొప్పింటి గొడవలు అయిపోయి తేలిన అంశాలు గోప్యంగానే వున్నాయి. ఎవరికి వారే సదురుకపోయారు.

ఆ తరువాత దాదాపు ఏడెనిమిది సంవత్సరాలు వీరనారాయణ పెళ్లిమాట ఎత్తలేదు. కుటుంబచరిత్ర తెలిసినవాళ్లెవరూ అతని హోదాకు తగినవాళ్లు అతనికి పిల్లనివ్వడానికి ముందుకు రాలేదు. వీరనారాయణకు భార్య అవసరం అంతకన్నా కలుగలేదు. పిన్నమ్మకు కోడలు అవసరంకన్నా, ఆలోచన కలిగే తీరికలేదు.

పిన్నమ్మకు కావాల్సిన వాళ్లెవరో చనిపోయారు. హఠాత్తుగా ఆమె కుప్పకూలిపోయింది. తిరిగి మనిష య్యేసరికి వైరాగ్యం పట్టుకున్నది. భక్తి పెరిగిపోయింది. హరికథలు చెప్పించింది. వీరనారాయణను వెంట తీసు కుని తీర్థయాత్రలు చేసొచ్చింది. ఎప్పుడో చనిపోయిన తండ్రి వంశం నిలబెట్టాలనే ఆలోచన ఆమెకు హఠాత్తు గా ఒక మహత్తర ఆశయంగా గుర్తొచ్చింది. వీరనారా యణకు ఈ ఏడెనిమిదేండ్ల తిరుగుడులో అలసట వచ్చింది. ఇద్దరూ చెరోదిక్కు నుంచి ఒకే నిర్ణయానికి వచ్చారు.

ఫలితంగా తనకన్నా వయసులో ఎంతో చిన్నపిల్ల, పేదపిల్లను పెళ్లాడాడు. ఆ పెళ్లి జరుగుతున్న సమ యానికి వీరనారాయణకు నలుభై, కమలకు పదిహేడు.

"కమిలీ ఏడసత్తివే - మొఖానికి వేడినీళ్లు పెట్టి నవా?" అత్త సత్యవతి సగం మూలుగుతో అన్న మాట లకు కమల ఆలోచనలు చెదిరిపోయాయి.

కమల పెళ్లై అయిదు సంవత్సరాలైంది. అయినా కమల కడుపు పండలేదు.

సత్యవతికి అన్ని ధ్యాసలు ఒకటైపోయాయి.

'గొడ్డుముండా' అని తిట్టడం- నోముల వరుస, వ్రతాల తతంగం అయిపోయాయి. నాటువైద్యులు, భూతవైద్యులు అలసిపోయారు. పంచాంగాలు, యంత్రాలు, కట్టడాలు పనిచేయలేదు. వేర్లు, తాయె త్తులు, మందులు, మాకులు, పుట్టల్లో పాలు పొయ్య డాలు, తీర్థయాత్రలు కమలకు సంతానం కలిగించ లేదు.

ఇక దవఖానాల చుట్టూ తిరగడమొక్కటే ఆఖరు లో కొచ్చింది.

కమలకు ముక్కులు దద్దరిల్లే ఘాటు వాసన, సిగరెట్టు కంపు అంతకన్నా రక్తం గడ్డకట్టుకుపోయే స్పర్శ - భయంకరమైన నిద్రపట్టని రాత్రుళ్లు తప్ప కాపురం గురించి పెద్దగా తెలియదు. చీకటి పడుతుండగానే కమల మనసుతోపాటు సర్వఅవయవాలు ముడుచుకు పోయేవి.

"గొడ్డుముండా! చప్పుడు చెయ్యవేందే? అమ్మా... శంకరా పరాత్పరా?" సత్యవతి ఆపసోపాలు పడుతూ మంచంలో నుంచి లేచి కూర్చున్న చప్పుడు.

కమల ఆలోచన గుట్టబోరు మీద విచ్చుకునే పున్నాగపూల దగ్గర తెగిపోయింది. తను ఎందుకు నిల బడిందో గుర్తేలేదు. ఏమాలోచిస్తున్నదో అంతకన్నా గుర్తు లేదు. చేదబావి ఆవలిపక్క ప్రహరి గోడల్లో గాలికి వూగు తున్న మొక్కజొన్న కర్రల్లో ఆమె చూపు చిక్కుకు పోయింది.

సత్యవతి మళ్లీ ఏదో తిట్టింది. ఇంటిముందు చింతలమీద అరిచే పక్షుల అరుపుల్లో ఆమాట కలిసి పోయింది.

బజారులో ఆవులు తమ లేగలను ఆఖరి పిలు పులు పిలుస్తున్నాయి. గాభర గాభరగా లేగలు తమ తల్లులను ఎటు పోవద్దని వేడుకుంటున్నాయి. బర్లు అలవాటైన స్వరంలో నేపథ్యగీతాన్ని ఆలపిస్తు న్నాయి. పశువుల మెడల్లోని చిరుగంటల మోతేకాక, బొనుగల పాడు చప్పుడు విన్పిస్తోంది. వీటన్నింటిలో పశువుల కాపర్ల అరుపులు. వాతావరణంలో నిండిపోయిన వేడితో పాటు ఒక విధమైన గోధూళి వాసన- పేడ తట్టల పిల్లల కొట్లాట - వీటన్నిటిని వదిలించుకొని కమల -

"వస్తున్నా," అన్నది పెద్ద గొంతుతో.

"నీ నోరుపడిపోను. వస్తున్నా అత్తా అంటే సత్తవా? నీ మొగుడు నువ్వు తినే తిండి మా బాపు సంపాయిం చిందే- లేకిడి ముండా!" సత్యవతికి మనసు ఎప్పుడో కూలబడిపోయింది. నోరు మాత్రం ఏ నియమాలు లేకుండా పనిచేస్తోంది. మాటల అర్థాలతో ఆమెకు పనిలేదు.

కమల మనసు కకావికలైపోయింది. సత్యవతి తిట్లకు కాదు. ఎందుకో కమలకు తెలియదు.

ఇక అప్పటి నుంచి కమల మళ్లీ రాత్రయ్యేదాకా చిత్రమైన స్థితిలో బతుకుతుంది. ఆకాశంలో స్వేచ్ఛగా ఎగిరే చిలక పంజరంలో పెట్టినట్టుగా గజిబిజవుతూ, మటుమాయమయ్యే కలలు- కొంతకాలానికి బయ టకు వొదిలినా ఎగురజాలని చిలకలాగా తయారవు తున్నది కమల. అది తనకు తెలుస్తూనే వున్నది. అదే నేమో బహుశా కమలకు అర్థం కానిదేదో.

కమల మళ్లీ మాటలు నిజమైన అర్థంతో (బహుశా కలలకు తిరిగి లేదా రూపం ఇచ్చుకునేది కూడా) మాట్లాడేది ఒక్క కిష్టయ్యతోనే... కమలకు మొదట తన తల్లి తండ్రిమీద ఆ తరువాత సత్యవతి, వీరనారాయణ మీద గొంతువరకు కోపంగా వుండేది. అది వ్యక్తం కాకుండానే గొంతు నులమబడేది. తనకు తెలియకుండానే కమల లోపల ఆ ఊరి ప్రపంచానికి భిన్నమైపోయింది. భిన్నమైన నేపథ్యంలో కిష్టయ్య, కమల ఇద్దరూ ఒకలాగే ముడుచుకుపోయారు.

బజారులోకి చూసినా తప్పుపట్టే సత్యవతి కిష్టయ్యతో మాటాడితే మాత్రం ఏమనదు.

'మొద్దుముండ! నా గండాన తాకింది,' కమల తనలో తాను గొనుక్కొని చేదబావి దగ్గర కట్టెల పొయ్యి అంటేసి కొప్పెర పొయ్యిమీద వేసింది.

కమలకు భర్త మీద, అత్త మీద చెప్పరానంత కోపం. కాని ఆ ఇంటి గోడలు ఆమెను భయపెడు తున్నాయి. ఆ ఇల్లు ఒక పద్మవ్యూహంలా, తనందులో చిక్కుబడిపోయినట్లుగా తోచింది.

భర్త లేచాడేమోనని యాదికి వచ్చింది.

చేతులకంటిన నీళ్ల తడిని కొంగుతో తుడుచు కుంటూ మూడిళ్ల భవంతిలో నుంచి నడచి భర్త గదిలోకి తొంగిచూసింది.

వీరనారాయణ అప్పటికే లేచి నడి మంచంలో కూర్చున్నాడు. అతని కళ్లు బుడ్డకప్పల్లా ఉబ్బి ఎర్రగా వున్నాయి. ముఖంమీద అసహ్యంగా నూనె జిడ్డు పేరు కొని వున్నది. వీరనారాయణ సన్నగా, నల్లగా వుంటాడు. కోలముఖంలో కత్తి మీసాలు, కొట్టొచ్చినట్టు కనిపించే కళ్లు- ఆ కళ్లే ఆమెను భయపెడతాయి.

"కమిలీ! చాయ్," వీరనారాయణ అరిచాడు.

కమల చాయ్ తయారుచేసుకొని కప్పు కుడిచేతి లో, చెప్పులు ఎడమ చేతిలో పట్టుకొచ్చి మంచం ముందు పెట్టింది.

"కిట్టడు అడవికి పోయిండా?"

"ఆఁ"

వీరనారాయణ లేచి బయటపడ్డాడు. ఎక్క డెక్కడో తిరిగి పదిగంటలకు ఇంటికొస్తాడు. ఆలోగా తను వంట చెయ్యాలి.

"ఏమే ఇయ్యాల్ల ఏమారం," సత్యవతి.

"శుక్రవారం," కమల.

"ఇల్లు కడిగేదున్నదా? లేదా? నియ్యతితోటే బర్కతి- నీకేమెరుక బర్కతి సంగతి," రుబ్బురోలులాగా దొర్లుతూ చేదబావి దగ్గరికి వెళ్లింది సత్యవతి.

కమల ఊపిరి సలుపని పనిలో లీనమయ్యింది. రాత్రి మంచంలో పడేదాక ఆలోచించడానికి తీరి కుండదు. తిట్లు, దీవెనలతో ఆరోజు గడుస్తుంది.

కిష్టయ్య, కమల జీవితాలు దాదాపు ఒకే లాంటివి. కిష్టయ్య పొట్టకూటి పాలేరు. కమల పెద్దింటి కోడలు. కిష్టయ్య ప్రపంచంలో పంట పొలాలున్నాయి. చిలుక పలుకులున్నాయి. తళతళ మెరిసే చెమట బిందువులున్నాయి.

అన్నిటికన్నా ముఖ్యంగా అతని పక్క రాగద్వేషాల మనుషులున్నారు. కమల బతుకులో చుట్టూ ప్రహరీ గోడ వున్నది. గోడ లోపల కుళ్లిపోయిన మనుషుల తిట్లు కోపతాపాలున్నాయి. కిష్టయ్య ఎంత ముడుచుకు పోయినా ఆలోచించడానికి పరిస్థితులు అనుకూలంగా వున్నాయి. కమల ఆలోచనలు భూస్థాపితమయ్యే అవ కాశాలే ఎక్కువ.

*

చలికాలపు చివరిరోజులు. ఉదయం పూట. బండ్లబాట కిరువైపుల ఏపుగా పెరిగిన జొన్నచేలు. పైర గాలి చేలమీద అలలు అలలుగా సాగుతోంది. జుమ్ మనే శబ్దంతోపాటు పుప్పొడి గాలితో నిండి హుషారు కలిగిస్తోంది. చేలమీద గోరువంకలు, చిలుకలు మత్తెక్కి నట్టు అరుస్తూ ఎగురుతున్నాయి. ఇంకా పూర్తిగా తొలగి పోని పొగమంచులో బంగారుతీగెల్లా సూర్యకిరణాలు మెరుస్తున్నాయి. పిట్టలను అదిలించడానికి చేలల్లో కావలివాళ్లు గొంతు చించుకొని అరుస్తున్నారు. రేకు డబ్బాలు- అక్కడక్కడ కట్టిన తాటాకులు మోగి స్తున్నారు.

నాలుగు బండ్లు బాట మీద నడుస్తున్నాయి.

కిష్టయ్య తప్ప మిగతా బండ్లల్లో బండికి ఇద్దరు న్నారు.

'కిట్టా పొలం పనికి ఒక్కనివే వత్తన్నవేందిరో? మీ పాలేర్లంత ఏడబోయిండ్లు?" ముందు బండి నొగల మీద కూర్చున్న గంగన్న అడిగాడు.

"నాకేందే ఓ ఇరువైవాసం పెండెలు గావాలే," కిష్టయ్య.

"వాసం పెండెలెందుకురో? పెండ్లిగిన చేసు కుంటునవ."

"ఎహె," కిష్టయ్య పెద్దగా నవ్వాడు.

"అదెరా? దుడ్డెతీర్గ సల్దిబుల్లి తిని కాళ్లు కడుపుల బెట్టుకొని పండుడేనా?"

"ఏ నీయవ్వ."

"లోపట మావున్నది కొడుక్కు," వెనుక బండి శాయిలు.

"మీ వీరనారాయణ రెండు పెండ్లిల్లు చేసు కున్నడు గదరా!"

"ఆయనకేంది మారాజు," శాయిలు.

బండ్లు పరుగెత్తాయి. లుకలుకలుగా వున్న బల్లలు శబ్దం చేశాయి.

"బిడ్డా! నీ కడుపుల మాట నలుగురికి చెప్పు కోవైతివి. నలుగుట్ల కలువకపోతివి. మంది మారు తండ్లు- నువ్వు మాత్రం మారకపోతివి. ఎద్దు తీర్గ కట్టం జేసుడే కాదుర. జెర లోకరివాజు తెలుసుకోవాలె. నీకు జీతం లేకపాయె. ఉగాదప్పుడు పాలేరోల్లంత పనులు బందు పెడితే నువ్వు పనికిపోతివి," గంగయ్య.

"ఆడు పాలేరా? పొట్టకూడోడేనాయె. గట్లనే వీర నారాయణ సేతల సత్తడు," శాయిలు.

బండ్లు అడ్డసడుగు (కంకర రోడ్డు) దాటి చేలల్లో నుంచి గోదావరి కేసి నడుస్తున్నాయి.

ఎండ పొడ రగరగలాడే సరికల్లా గోదావరి తీరం లోగల అడివికి నాలుగు బండ్లు చేరుకున్నాయి. ఈలోగ మూడు చిన్న చిన్న పల్లెలు చుట్టేశాయి. గోదావరి ఆవలి తీరంలో ఊళ్లు కనిపిస్తున్నాయి.

మూడు బండ్లు కొంచెం అడివి లోపలకంటా వెళ్లి పోయాయి. ఒక్క కిష్టయ్య మాత్రమే మొదట బండి విడుచుకున్నాడు.

బండిలో వెంట తెచ్చిన జాడుసొప్ప ఎద్దు ముంద పడేసి గొడ్డలి తీసుకున్నాడు.

కొడిశె, టేకు, పాలకొడిశె, చిలుగు, తునికి చెట్లు దట్టంగా వున్నాయి. మధ్య మధ్య కంకపొదలు (వెదురు పొదలు). కంకపొదల్లో అడవికోళ్లు కురకురలాడు తున్నాయి. చిమ్మెట్లు అదేపనిగా పలుకుతున్నాయి. గువ్వలు గూస్తున్నాయి. పక్షుల అరుపులు, గాలిమోత- అడవిలో అనేక పూల పరిమళం నిండిన వాసన.

కిష్టయ్య ఒక్కొక్క చెట్టునే పరిశీలిస్తున్నాడు. టేకు వాసాలు నరుకుదామనుకున్నాడు. చౌకీదారు (ఫారెస్టర్) వస్తే కిరికిరి. అలాంటి పని చేయొద్దని వీరనారాయణ నిన్ననే చెప్పాడు. బర్ల కొట్టం దక్షిణంవైపు నాలుగు వాసాలు విరిగినయ్. కొడిశె వాసాలైతే పర్వాలేదు.

ఓ కొడిశె వాసం పెండెకు గొడ్డలేశాడు. కొడిశె పొదలో నుండి కుందేలొకటి గెఫగెఫ లేచి పరుగెత్తింది. నెత్తిమీదనే తీతవ వెక్కిరిస్తూ ఎగిరింది.

"నీయక్క పులుసు కాద్దనుగదా!" కిష్టయ్య దానివెంట కొంత దూరం పరుగెత్తి ఆయాసంగా ఊపిరి పీలుస్తూ అనుకున్నాడు.

వాసాలు నరుగసాగండు. మెదట్లో ఎన్నో ఆలో చనలు రేగుతున్నాయి. బహుశా ఇందాక గంగయ్య, శాయిలు వాల్లు అన్న మాటల ప్రభావం కాబోలు. తన అంతరంగాన్ని, తన లోపటి విచారాలను వ్యక్తం చేయ జాలడు.

ఎందుకో కమల కోమలమైన ఎర్రటి మొఖం కన్పించింది. తనను ఎప్పుడూ ఏదో పెడరసం మాట అంటుందెందుకో? మనిషి మంచిదే.

వద్దనుకున్నా వీరనారాయణ కుటుంబం గుర్తొ స్తోంది.

'తనుకూడా పెండ్లి చేసుకుంటే,' కిష్టయ్య ఉలిక్కి పడ్డాడు. చేతులు కాళ్లు గజగజ వణికాయి. ఒళ్లంతా చెమట పట్టినట్లయింది. గుండె ధణధణలాడింది. అప్పటికి పదివాసాలు మాత్రమే నరికాడు. గొడ్డలి ఎత్త లేకపోయాడు. ఓ నల్లనిరాయి మీద తనను తాను కూడ దీసుకోవడానికి కూర్చున్నాడు. అంతరంగంలోని ఘర్షణ తనకేం పట్టనట్టు గొడ్డలి మీదే దృష్టి నిలిపి దాన్ని అటిటు తిప్పాడు.

కమల ఎందుకో తనను చూసి పడి పడి నవ్వు తోంది. ఆ నవ్వు ఆ అడివిలో ప్రతిధ్వనించినట్లుగా చుట్టూ చూశాడు. ఎప్పుడు చేరిందో కోతుల మంద కిచకిచ లాడుతూ చెట్లమీద దూకుతున్నాయి. నల్లటి ముఖాలుగల కొండెంగలు తోకలూపుతూ తూర్పు వేపున గల గుట్టబోరు మీదికి పోతున్నాయి. కోతుల కిచకిచలకు బెదిరి ఏదో ప్రమాదం వచ్చినట్లుగా పక్షులు గుంపులు గుంపులుగా ఎగిరి ఎటో పోతున్నాయి.

హఠాత్తుగా ఒక స్త్రీ చిరిగిన బట్టలు, చింపిరి తలతో నిలబడి దోసిట్లోకి మట్టి తీసుకుని వీర నారాయణ ఇంటిమీదికి విసిరి, "నా బతుకు కుక్కలు చింపిన ఇస్తరి జేసిండ్లు మీరు మునిగి ముతమాయమై పోతారు," అరుస్తూ ఏడుస్తోంది. పిల్లలు ఆమె వెంటబడి తరుముతున్నారు. ఆ స్త్రీ పరుగెత్తుతోంది. రాళ్లతో ఎవరో కొడుతున్నారు. ఆమె తల నుండి రక్తం కారుతోంది.

కిష్టయ్య కండ్లవెంట బొటబొట కన్నీళ్లు కారాయి.

"ఓరి కిట్టయ్య జెర ఇటురారా!" గంగయ్య అడివి ధ్వనులిచ్చేటట్లు పిలుస్తున్నాడు.

కిష్టయ్య కన్నీళ్లు తుడుచుకొని ఆ పిలుపు విన్పిం చినకేసి నడిచాడు.

గంగయ్య ఒక తునికి దోని నరికాడు. దాని మధ్య తొలిచేసి దోనిలాగా తయారుచెయ్యాలని అతని సంకల్పం. మిగతా బండ్లవాళ్లు కూడా వచ్చారు. అందరూ తలోదిక్కు చేరి గొడ్డళ్లతో దాన్ని దోనిలాగా చెక్కారు. దానిని బండిమీది కెక్కించారు.

అప్పటికి పొద్దు వంగిపోయింది.

కిష్టయ్య తన బండి దగ్గరకొచ్చాడు. వాసాలు నరుకుతున్నాడు. చిల్లలు చెలిగేసి బండిమీద మెలి గాడు. పొద్దు గూకడానికొచ్చింది. మిగతా మూడు బండ్ల వాళ్లు బండ్లు కట్టుకుని వచ్చారు.

కిష్టయ్య ఎడ్లు నీళ్లకోసం పెనుగులాడు తున్నాయి.

"ఏమాయెర కిష్టయ్య ఇంకా బండి కట్టలేదు. రాత్రయిపోతది," గంగయ్య.

బండ్లు నిలబడ్డాయి. ఎడ్ల మెడలు ఆ బరువుకు జువజువలాడుతున్నాయి. పైగా అడివి ఈగలు వాటి మీద ముసిరి కుడుతున్నాయి. ఎడ్లు ఆగలేక కదం తొక్కుతున్నాయి.

"ఎడ్లు నీళ్లకు తండ్లాడుతున్నయ్. మీరు మెల్లెగ నడిపియ్యండ్లి. నేను బండి తరుముకొచ్చి మిమ్ముల కలుసుకుంట- నాయి కోసన్నేవాసం పెండెలుగదా!" కిష్టయ్య వాళ్లకు చెప్పి దక్షిణపు వేపునగల గోదావరికేసి ఎడ్లతో సహా నడిచాడు.

బండ్లు వెళ్లిపోయినయ్.

ఎడ్లకు నీళ్లుపెట్టి నీళ్లల్లో దిగి తను కడుపు నిండా నీళ్లు తాగాడు. జబ్బలు మెడ కడుక్కున్నాడు. పడమటి వేపున్న గల రేవు దగ్గరి బల్లకట్టు మీది ఎవడో మంచి హుశారు మీద పాడుతున్నాడు.

మూతి తుడుచుకుంటూ కిష్టయ్య ఒడ్డు ఎక్కుదా మనుకునేసరికే కిష్టయ్యకు పదిగజాల దూరంలోగల కోసుబండ మీది నుండి ఏదో దొర్లి నీళ్లల్లో పడ్డట్టుగా బుడుంగుమని శబ్దం వచ్చింది.

కిష్టయ్య కాళ్లమీద లేచి అటుకేసి చూశాడు. ఏదో మునుగుతూ తేలుతూ వుంది. అటుకేసి పరుగెత్తాడు. ఒక స్త్రీ నీళ్లల్లో మునుగుతూ తేలుతూ వున్నది.

కిష్టయ్య నీళ్లల్లో దునికి ఆ స్త్రీని ఎత్తుకుని ఒడ్డు మీదకి లాక్కొచ్చాడు. వయసు దాదాపు నలభై సంవత్స రాలపైనే వుంటుంది.

పడమటి సూర్య కిరణాలు నీళ్లమీద ప్రతిఫలిస్తు న్నాయి. నీళ్ల మీదికంటా పెరిగిన విషముష్టి చెట్లు నీడలు కప్పేస్తున్నాయి. కిష్టయ్య మెదడు పనిచేయ లేదు. ఆ స్త్రీ శవంలాగా ఒడ్డుమీద పడి వున్నది. మోకాళ్ల మీదికంటా వంగిచూశాడు. బొళుక్కున నీళ్లు కక్కింది. మరో రెండుమార్లు తను ఎప్పుడో చూసిన విధంగా చేతు లతో నడుముదాకా ఎత్తి పడుకోబెట్టాడు. పది నిమిషాల తరువాత నీర్సంగా ఏదో అంటోంది.

"నన్ను సంపు...తరు," చాలా కష్టంమీద ఆమాట అర్థం చేసుకున్నాడు కిష్టయ్య. ఎడ్లపగ్గాలు పట్టుకొని చాలాసేపు కూర్చున్నాడు. ఏమి చేయాలో తోచలేదు. ఆమెనట్లా ఆ మునిమాపు సమయంలో ఒదిలిపెట్టి ఎట్లా పోగలడు? ఎవరీమె? ఈమెకు ప్రాణం తీసుకోవా లన్నంత కష్టం ఎందుకు వచ్చినట్టు? తను తీసుకపోతే తీసుకుపోయిన తరువాత? ఇలాంటివో, మరికొన్నో వందలాది ప్రశ్నలు అతన్ని చుట్టుముట్టాయి... వాటన్నిటిని దూరంగొట్టి ఒక నిర్ణయానికి వచ్చి ఆ స్త్రీని భుజం మీద వేసుకొన్నాడు. ఆ వొత్తిడికి ఆ స్త్రీ కడుపులో మిగిలిన నీళ్లన్నీ కక్కింది.

ఎడ్లు తినగా మిగిలిన జాడుసొప్ప, కానుగు, తునికి ఆకులు వాసాలమీద మెత్తగా పరిచాడు. తలగుడ్డ, ఆమె తలకింది పెట్టి బండి కట్టిండు.

అప్పటికి చెట్లకింది నుండి చీకటి విస్తరిస్తోంది. బండి నడుస్తోంది. ఈమె ఎవలు? ఈమెను తీసుకుపోయి ఏడ వుంచాలి? ఊరి వాళ్లందరికి ఏమని చెప్పాలి? ఇలాంటి ఏ ప్రశ్నకు కిష్టయ్యకు జవాబులు తెలియదు.

బండిలో ఆ స్త్రీ మూలుగుతూనే వున్నది. ఆకాశం లో చుక్కలు మొలిచాయి. బండి మెల్లగా నడుస్తోంది.

*

బయట మంచు కురుస్తోంది. పైరగాలి తగ్గింది. చలి గజగజ లాడిస్తోంది. ఎడ్ల కొట్టంలో దోమల బాధకు ఆగలేక ఎడ్లు చెవులు లొటలొట కొట్టుకున్నాయి. బర్లు నెమరు వేస్తున్నాయి. దోమలు గుయ్యిమని మోత పెడు తున్నాయి.

నెగడి చిటపట మండుతోంది. అతని కెదురుగా చంద్రమ్మ కూర్చున్నది. ఆమె కన్నీళ్లు ధారగా కారు తుండగా చెప్పుకొచ్చింది. కిష్టయ్య ఒక్కమాటన్నా మాట్లాడకుండా విన్నాడు.

చంద్రమ్మ గొంతు గుడగుడ లాడింది. మాటలు ముద్దైపోయి ఆమె వెక్కివెక్కి ఏడవసాగింది.

కిష్టయ్య నిలువెల్లా కదిలిపోయాడు. "ఏడవకు. ఏడవకు," అన్నాడు అంతకన్న ఏమనాలో తెలియక.

"నన్నెందుకు బతికిచ్చినవ్" చంద్రమ్మ.

కిష్టయ్య జవాబు చెప్పలేదు. అతనికి అర్థమైన మేరకు చంద్రమ్మ బాగా బతికిన మనిషి. రెండు నాగండ్ల చేత, భర్త పిల్లలు. భర్తకు సంవత్సరం క్రితమే గొడ్డలి తెగింది. నాటుమందులతో గాయం మానింది. ఆ తరువాత ధనుర్వాతము వచ్చి చనిపోయాడు. అప్పటికే ఇద్దరి కొడుకుల పెళ్లిళ్లు అయిపోయాయి. తండ్రి చని పోగానే ఉన్న భూమి పంచుకొని వేర్లు పడిపోయారు. పిల్లి తన పిల్లల్ని ఇల్లిల్లు తిప్పినట్టు తల్లిని తిప్పారు. ఎవరూ కూడు బెట్టరు. దుర్మార్గపు డబ్బు ప్రపంచంలో తను ఎవరికీ పనికిరానిదయ్యింది. కోడండ్లు కొట్టారు. వాళ్లందరి వాలకం చూస్తే తనను ఏ రాత్రో గొంతు పిసికి చంపేలాగున్నారు. కనుక తను బతికి ప్రయోజనం లేదని నిర్ణయించుకొని గోదావరిలో దూకింది.

ఇలాంటి కథలు కిష్టయ్య చూస్తున్నవే- చాలా మంది తల్లులు భర్త వుండగానే ముందుచూపుగా వెండో, బంగారమో తమ మీద వేసుకుంటారు. ఆ వెండి, బంగారం మీది మమకారంతో కొడుకులు చేర దీస్తారు. లేదా తమ పేరుమీద కొంత భూమి వుంచు కుంటారు. ఏ ఆస్థి లేకుండా ఏ కుటుంబంలోనైనా ఆడ వాళ్లకు ఆదరణ తక్కువే. చాలామంది పంచాయితిల కెక్కుతారు. ఈమె ముక్కుసూటి మనిషై వుంటుంది.

కిష్టయ్యకు తన తల్లి జ్ఞాపకం వచ్చింది. ఏమిలేక తన తల్లి బజారులో నిలబడింది. ఈమె అన్నీ గుంజు

కొని తన తల్లిలాగే బజారున నిలబడ్డది. తన తల్లి తన కోసం బతకాలని బతుకలేకపోయింది. ఊరు ఊరంతా తరిమి తరిమి కొట్టారు. అప్పుడు తను చిన్నవాడు. ఇప్పుడు తన తల్లిలాగే చంద్రమ్మ బజారులో నిలు చున్నది.

కిష్టయ్య లేచి నిలబడి ఎడ్లకొట్టం బయటికొచ్చి నిలుచున్నాడు. తెల్లారే సుక్క పొడిచి బారెడెక్కింది. అతని మెదడు మొద్దుబారిపోయింది. నిద్రలేమితో అతని కళ్లు మండుతున్నాయి. అతనికి ఊరి రీతి రివాజుల మీద పట్టరాని కోపం కలిగింది. అతనెప్పుడు పైకి చెప్పలేదు గాని ఊరిలో జరిగే ప్రతి దానిపట్ల అతనికి ఆగ్రహంతోపాటు వ్యతిరేకత వుండేది.

కిష్టయ్య చేతులు రాసుకుంటూ నెగడు ముందు వచ్చి నిల్చున్నాడు. చంద్రమ్మ మంటకేసి తదేకంగా చూస్తున్నది.

''నువ్వు సావద్దు,'' ఈ మాట తరువాత ఏమనాలో తోచలేదు.

చంద్రమ్మ తలెత్తి కిష్టయ్య ముఖంలోకి చూడ ప్రయత్నం చేసింది.

కిష్టయ్య ముఖం చీకట్లోకి తిప్పుకొని, "నాకు దేని మీద ఖాతరు లేదు. ఇక్కన్నే బతుకు,'' కిష్టయ్య అనేసి కొట్టం, గడికొయ్యలు తీసుకొని బజారులోకొచ్చాడు.

'ఇద్దరం కలిసి బతుకుదాం,' అనాలనుకున్నాడు. మరికొన్ని మాటలు ఆమెకు ధైర్యం చెప్పేందుకు చెప్పా లనుకున్నాడు. ఏడిచేదాన్ని ఏడిపించేందుకు, బలహీ నుల్ని హింస పెట్టేందుకు, మోసం చేసేందుకు వేల మాటలున్నాయి. కాని ఆ సమయంలో కిష్టయ్యకు ఒక దుఃఖితురాలును ఓదార్చే మాటలు మాత్రం దొరుక లేదు.

కిష్టయ్య చేతులూపుకుంటూ బజారులో నడుస్తు న్నాడు. అప్పుడే గుడిసెల ముందు బరుకు బరుకున చీపుర్ల చప్పుడు మొదలయ్యింది. శద్దర్లు కప్పుకుని పురుషులు గుప్పుగుప్పుమని చుట్ట పొగలు వదులుతూ చెరువుకేసి పోతున్నారు. నెగళ్ల ముందు పిల్లలు ముసలి వాళ్లతో శాత్రాలు (కథలు) చెప్పించుకుంటున్నారు.

కిష్టయ్య వీరనారాయణ ఇంటి ముందుకు వచ్చేసరికి పక్షుల అరుపులు, పశువుల కాపర్ల అరుపులు మొదలయ్యాయి.

కిష్టయ్య ఇంటి వెనుక నుంచి చేదబావి దగ్గర కొచ్చి బావి తిన్నెమీద కూర్చున్నాడు. ఇందాక దూరం గొట్టిన ఆలోచనలు ముసురుతున్నాయి.

కమల ఆవులిస్తూ నిదుర కళ్లతో తలుపుతీసి కిష్టయ్యను చూసి ఉలిక్కిపడి "నువ్వా, మూగమొద్దు తీరు కూసున్నవ్- రాత్రి తిండికి రాలేదేంది? పదింటిదాక నీకోసం చూసి చూసి పడుకున్న.'' గొంతు తగ్గించి, "ఆయన నీమీద కోపం గున్నడు,'' లోపలికి వెళ్లి పాల సరువ తెచ్చి యిస్తూ అన్నది.

''కమలక్కా...'' కిష్టయ్య లేచి నిలబడి ఎటో చూస్తూ.

''ఎన్నిసార్లు చెప్పాలె- నీ మెదట్లో పెంట తప్ప.''

ఆమె మాట పూర్తికాకుండానే, ''నేను ఒకా మెను...''

''ఆఁ ఒకామెను?'' కమల నోరు తెరిచి.

''తెచ్చుకున్న.''

''ఓర్నీ నిన్ను దొంగలు బొడువ - చెప్పకుండ చెయ్యకుండ పెండ్లి చేసుకున్నవ. ఐనా ఏమి లేనివోనివి పెండ్లెట్ల చేసుకుంటవు గని? కాలాంతకుడివే! ముడ్డికి గోసి లేనోడు నెత్తి రుమాలు కేడ్సిండంట. ఆడదంటె మాటలా? ఏడుంటవ్. ఏం బెడుతవ్? నీకు దొరికిన దిక్కుమల్లెదెవతబ్బా!'' కమల.

కిష్టయ్య చంద్రమ్మ గురించి చెప్పాడు.

కమల కళ్లొత్తుకున్నది.

వెర్రి కిష్టయ్య కమలకు ఎంతో ఉన్నతుడిగా కన్పించాడు.

''కిష్టయ్యా ఊళ్లోళ్లు నిన్ను బతకనిస్తరా?''

''అదే నేనేమన్న దొంగతనం చేసిన్నా!''

''నీకు అర్థం కాదులే-'' కమలకు నిజానికి కిష్టయ్యే అర్థం కాలేదు.

కమల లోపలికి వెళ్లి రెండు పాత చీరెలు, రెండు పాత రవికలు తెచ్చి యిచ్చింది. యాభై రూపాయిలు చేతిలో పెట్టి "కిష్టయ్యా! నాదగ్గరున్న పైసలు గింతే - కుండో బోడో కొనుక్కో. నేను చెయ్యని ధైర్యాన్ని నువ్వు చేసినవ్....' కమల కంఠం ఎందుకో ముద్దైపోయి లోపలికి వెళ్లిపోయింది.

కిష్టయ్యకు ఆ కంఠంలోని వొనుకు తెలుసు... తనేం చేయలేడు.

ఆ గుడ్డలు పాల సరువలో కుక్కుకొని కొట్టంకేసి నడిచాడు.

కిష్టయ్య కొట్టం దగ్గరికి చేరుకునేసరికి ఇంకో పాలేరు ముసలి దుబ్బయ్య, బర్లగాసే సాంబడు, గొడ్లగాసే అయిలుగాడు అందరు చంద్రమ్మతో కలిసి పోయారు. చంద్రమ్మ వాళ్లకేం చెప్పిందో? వాళ్లేం అర్థం చేసుకున్నారో తెలియదు.

దుబ్బయ్య మక్కజొన్న పెరడికి మంచె కావలికి పోతూ పెరడుకు నీళ్లు కట్టాలని చెప్పిపోయాడు.

కిష్టయ్య బర్లపాలు పితుకుతూ వుంటే చంద్రమ్మ పేడ తీసింది.

ఇద్దరూ కలిసి కొట్టాన్నే ఆనుకొని ఉన్న మొక్క జొన్న పెరట్లోకి వెళ్లారు. కిష్టయ్య కరంటు పంపు వేశాడు. ఇద్దరు కలిసి నీళ్లు కడుగుతుండగా వీర నారాయణ ధుమధుమలాడుతూ వచ్చాడు.

''కిట్టిగా - ఓరి కిట్టిగా,'' గావుకేక పెట్టాడు.

కిష్టయ్య మక్క పెరట్లో నుండి పరుగెత్తు కొచ్చాడు.

''లం...కొడుక నేను నీకు చెప్పిందేంది? నువ్వు చేసిందేంది?'' చెప్పు ఊడబీకి కొట్టసాగిండు. కిష్టయ్య నీటికాలువలో పడిపోయాడు. ఒళ్లంతా బురద. కిష్టయ్య మనసు కుదురుకొని దానికి శరీరం యావత్తు తయారై లేచి వీరనారాయణను అదే బురదలో వేసి కొట్టేవాడే- కాని ఎక్కిడి నుండో చంద్రమ్మ ఉరుకొచ్చి వీర నారాయణ చేతిలోని చెప్పు గుంజుకొని విసిరేసింది.

గజగజ వనుకుతాడనుకున్న కిష్టయ్య నిటారుగా లేచి నిలుచున్నాడు. అతని కళ్లు వీరనారాయణ అదివరకెప్పుడు చూడలేదు.

చంద్రమ్మ ఏదో అంటోంది. ఇద్దరు కలిసి తనను గొంతు పిసికేసేవాళ్ల లాగా కన్పించారు. వీరనారాయణ గబగబ వెనుదిరిగి కొట్టంకేసి నడిచాడు. గడంచ వాల్చు కొని కూర్చొని సిగరెట్టు మీద సిగరెట్టు తాగాడు.

కిష్టయ్య, చంద్రమ్మ కలిసి బతుకుతున్నారు. రెండు నెలలు గడిచిపోయాయి. చలికాలం వెళ్లి ఎండా కాలమొచ్చింది. పంటచేలన్నీ కోసి కుప్పలేశారు.

ఈ రెండు నెలలు కిష్టయ్య, చంద్రమ్మల గురించి రకరకాలుగా ఊళ్లోవాళ్లు చెప్పుకొన్నారు.

''ముట్టుడిగిన ముండకు పడుసుపోరన్ని పట్టు కోను బుద్దెట్లా వచ్చిందో? చిత్రం కాకపోతేంది? కులం కూడ కాదట- గొడ్లకొట్టంలో అలికి రోజు ముగ్గు పెడు తున్నదట- దినాం తానం జేత్తదట- కొడుకులున్నదే నట.'' ఈ రకంగా స్త్రీలు.

''ఎడ్డోని మాయజేసి పట్టేసింది. కులం సెడ్డా సుఖం దక్కాలంటరు,'' ఇలాంటివో ఇంతకన్న అధ్వాన్న మైనవో పురుషుల మాటలు.

ఈ మాటలన్నీ దాదాపుగా దేహ సుఖానికి సంబం ధించినవే. ఆ ఊళ్లోవాళ్ల మానసిక ప్రపంచం యావత్తూ ఛిన్నాభిన్నమైనదే- వాళ్లు తరతరాలుగా అనేకరకాల అణిచివేతల మధ్య బతికి మానసిక ప్రపంచాన్ని కోల్పో యారు.

కిష్టయ్య, చంద్రమ్మ కలిసి బతకడంలో దేహ సంబంధంకన్నా భిన్నమైనదేదో ఉన్నదనేది- అదేమిటో స్పష్టంగా తనకు తెలియకున్నా ఒక్క కమల మాత్రమే అర్థం చేసుకున్నది. కమల దేహ సంబంధాల గురించి పూర్తిగా విసిగి ఉన్నది. వీరనారాయణ మాత్రం ఊళ్లో తను కొట్టిన అవతలివాడు గజగజ వనక్కుండా లేచి నిలబడ్డాడంటే ఆ తరువాత జరుగబోయేదానిదాకా లాభనష్టాలు బేరీజు వేసుకున్నాడు... ఎటు చూసినా ఇది తనకు ఏమాత్రం నష్టంలేని పనిలాగే కన్పించింది. అదే కిష్టయ్య పడుచుదాన్ని చేసుకుంటే- కడుపులు, కాన్పులు, జీతాలు, కొలుపులు, ఆ బాధలేదు. సచ్చేదాక ఇద్దరు చేస్తరు. పైగా కిష్టయ్య బతుకు నాశనం జేసిన్ననే అపవాదు తప్పుతుంది.

కిష్టయ్య ఒళ్లంతా కడుక్కొని కొట్టంలోకి వచ్చాడు.

''కిట్టా! నువ్వు పెండ్లి చేసుకోవాలనుకుంటే నాతోని చెప్పకపోతివి. చిలుకసొంటి పోరిని చూసి చెయ్యకపోదునా?''

'తనకు చిలకసొంటి భార్యను తెచ్చి వీడే...' కిష్టయ్య లోపల. పైకి మాత్రం ఏమనకుండా నిలు చున్నాడు.

వీరనారాయణ ఇంకొంచెం కంఠం మార్చి, ''చేసు కున్నోనికి చేసుకున్నంత మారాజా అన్నారు. అండ్ల నీకు రుషెంతున్నదో నాకేమెరుకగని- అగో ఆమూలకు తాటి కమ్మలు తెచ్చి సాటు కట్టుకో- బతుకు. దానిదేం కులమో? ఎట్ల తెచ్చినవో? పంచాదుల జికిరి నాకు లేదు,'' వీరనారాయణ లేచి వెళ్లిపోయాడు.

*

వాళ్ల మాటల సారాంశాన్ని బట్టి వాళ్లిద్దరు ఊళ్లో వాళ్లందరికన్నా సుఖంగా, ధైర్యంగా బతుకుతున్నారను కున్నది. ఒకటి, రెండుసార్లు తారసపడినా తప్పించు కున్నదేగాని కమలకు చంద్రమ్మతో మాట్లాడే అవకాశమే దొరకలేదు. కిష్టయ్యకు అప్పటి నుండి తీరికలేదు. కిష్టయ్య మునిపటిలాగా కమలతో మాట్లాడడం లేదు. ఒకవేళ మాట్లాడినా సత్యవతి ఓర్వడం లేదు. కిష్టయ్య మునుపటి ఎడ్డి కిష్టయ్య కాదుగదా!

కమలకు సరిగ నిదుర పట్టడంలేదు. దారితెన్నూ లేని ఆలోచనలు ఆమెను మునుపటికన్నా ఎక్కువగా వేధిస్తున్నాయి. ఆమెకు ప్రతి పని కలత పెడుతోంది. తను భర్తనెందుకు భరించాలి? అత్త సత్యవతికి ఎందుకు భయపడాలి? సేవలెందుకు చేయాలి? కిమ్మనకుండా భరిస్తూ కిష్టయ్య కన్పించేవాడు. తన లాంటి వాళ్లందరికీ మరోవిధంగా బతుకుండగలదని కమలకు తెలియదు. కాని ఎందుకూ పనికిరాడనుకున్న అనాథ కిష్టయ్య తనలాంటివాడు కాదు. ఊరును, సకల రీతి రివాజును ఎదిరించాడు. మరి తనకో తల్లీ, తండ్రీ ఉన్నారు. అయినా తను పుట్టుబానిస, తను ఈ నాలుగు గోడల మధ్య భూస్థాపితం కావాల్సిందేనా?....

ఇలాంటి దరిదాపు లేని అనేక ప్రశ్నలు ఆమెను చుట్టు ముట్టేవి.

ఒకనాటి మధ్యాహ్నం వీరనారాయణ వాలు కుర్చీలో సేదదీరుతున్నాడు. సత్యవతి వెనుకగదిలో ఊరికనే పడుకున్నది.

తల్లీ, కొడుకు సాధారణంగా మాట్లాడుకోరు. వాళ్లిద్దరి మధ్య మసుకు వాళ్లిద్దరికి తెలుసు. మొదట తను ఈ ఇంట్లోకి వచ్చిన కొత్తలో వీరనారాయణ- సత్య వతి, ఆమె తండ్రి తనకు శత్రువులనుకునేవాడు. తనను పంటపొలాల నుండి, అన్నదమ్ముల నుండి విడదీసి ఈ జైల్లో బంధించారనుకునేవాడు. క్రమంగా ఆస్థి పాస్థుల నిషా ఒళ్లంతా పాకి శారీరక శ్రమకు దూరమై జైలుకే అధికారిగా మారిపోయాడు. ఇప్పుడు తనకు గతానికి సంబంధించిన ఏ స్మృతీ మిగిలిలేదు.

ఈమధ్య కమలలో ఏదో మార్పు వస్తోంది. అదే మిటో తనకు తెలియడం లేదు. ఆ చూపులు కలవర పెడుతున్నాయి. కిష్టయ్య సకల మర్యాదలను ధిక్క రించాడు. అంటే తనను ధిక్కరించినట్లేనా? ఈ ఊళ్లో ఉన్న సంబంధాలను, కట్టడీలను వాడు లెక్క చేయ లేదు. అంటే తనను సవాలు చేస్తున్నట్టేనా? అందరూ ఇదే మార్గం పడితే- ముఖ్యంగా కమల!

వీరనారాయణ ఉలికిపడ్డాడు. ఊళ్లో ఏ సంబంధం సక్కగా ఉన్నది కనుక. అదేదన్నాకాని కిష్టని లాంటి కోన్‌కిస్కేగాడు కట్టడిని ఎదిరిస్తే... తను అప్పుడే వాన్ని విరిచి కట్టేయించి పంచాయితీ చేసి- వాన్నీ, దాన్నీ ఊళ్లో నుంచి వెళ్లగొట్టవలసింది. కాని తను అజమా యిషీ చెయ్యలేదు. చేస్తున్నట్టుగా కన్పించగలడేకాని చేయలేడు. ఆ పని ఇంకెవరన్నా చెయ్యగలరా? ఇప్పటి కైనా మించిపోయిందేమి లేదు... అడుగున ఏదో కదులుతోంది. తను ఏ కప్పుకింద బతుకుతున్నాడో- ఆ యింటివాసాలే పుచ్చిపోయి ఉన్నాయి. వాడు అన్ని టికీ తెగించిన కిష్టడు- తన ఇంటి సంగతులు ఎత్తితే...

వీరనారాయణ ఇలాంటి ఆలోచనల్లో ఉండగానే కమల తయారయ్యి ఎటో చూస్తూ నిలుచున్నది. కాళ్లకు చెప్పులున్నాయి.

"తల్లిగారింటికి పోతదట. ఆ లేకిడింట్ల ఏమున్న దని?" సత్యవతి ఆయాసంగా...

వీరనారాయణకు చివ్వున కోపమొచ్చింది. తనను అడుగకుండానే నిర్ణయం చేసుకున్నదన్నమాట- అదీ కూడా తను అడగడం లేదు. కాని తన హావభావాలు ముఖంలో కన్పించనియ్యకుండా ఉండడం అన్నిటితో పాటు అలవాటయ్యింది.

"ఇప్పుడేమున్నదని?" శాంతంగా వీరనారాయణ.

కమలకు చిర్రెత్తుకొచ్చింది. ఆమె ముఖం ఎర్ర బడ్డది.

"చూడబుద్దయి."

వీరనారాయణ కమల ముఖం చూడనట్టే నటించి- ఆమె కోపాన్ని పట్టించుకోనట్టే-

"కిట్టిగాన్ని వెంట తీసుకపో."

"వాళ్లక్కడికత్తే ఖదరు పోదా?"

వీరనారాయణ మాట్లాడలేదు. అతను ఆగ్రహో దగ్రుడై మీదపడి కొడుతాడని తను అంతకన్నా కోపంగా ప్రవర్తించగలనని కమల అనుకున్నది. కమల ఏకపక్ష కోపంతోనే గబగబ బయటకు నడిచింది.

వీరనారాయణకు అప్పుడు కోపం బుసబుస పొంగి పళ్లు కొరుక్కున్నాడు. తనకు తెలియకుండా ఈ ఇంట్లోనేకాదు, బయట ఏవేవో జరుగుతున్నాయి.

"ఆ గొడ్డుముండకు ఇగ పిల్లలు పుట్టరు," సత్య వతి గదిలో గొనుగుతోంది.

వీరనారాయణ కుర్చీలో నుండి లేచి పచారు చేస్తున్నాడు. కాలి నడకన వెళ్లిపోయింది. పైగా అలాంటి ముఖంతో- బండి మీదనన్నా పోలేదు. ఊళ్లోవాళ్లంతా చూస్తారు. కమల ఈ ఇంటిని, తనను ధిక్కరిస్తోందని అర్థం చేసుకుంటారు. ఎక్కడ చిల్లి పడినట్టు?

వీరనారాయణ దాదాపు గంటసేపు సిగిరెట్లు తాగుతూ పచారు చేశాడు.

కమల తల్లిగారిల్లు ఆవూళ్లోనే- పైవాడకే- పోను రానూ కలిపి పదిహేను నిమిషాలకన్నా ఎక్కువ కాలం పట్టదు.

"ఎన్ని సంపాదించి ఏం భాగ్గెం? మొదటి ముండ అట్లా చేసె? ఈ ముండ సావదాయె," సత్యవతి ఆఖరి మాట అనడం- కమల లోపలికి అడుగుపెట్టడం ఒకే సారి జరిగాయి.

కమల ఆమాట విననట్టే, అక్కడ వీరనారాయణ లేనట్టే తన గదిలోకి వెళ్లింది. మంచం మీద కూర్చున్నది. ఎందుకో తను ఏదో పూనినట్టు తండ్రి ఇంటికి వెళ్లిన దంతా రోతగా కనిపించింది. కోపంగా బజారులో ఎవ రిని చూడకుండా తండ్రి ఇంటిదాకా నడిచింది. దారిలో కలిసినవాళ్లు వంగి దండాలు పెట్టారు. పరామర్శిం చారు. విస్తుపోయారు. అవన్నీ జ్ఞాపకం వచ్చాయి కమలకు.

అక్కడ జొన్నకుప్ప దగ్గరున్న తండ్రిని ఇంట్లోకి పిలిపించి తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టింది. కన్నబిడ్డను అమ్ముకునే కసాయోడన్నది. బిడ్డను రెండెకరాల పొలాని కమ్ముకున్నరన్నది. అందరు ఒక్కమాటన్నా మాట్లాడ కుండా నోళ్లు తెరిచారు. తనకు పిచ్చి లేసిందేమోననే లాగున్నాయి వాళ్ల చూపులు.

కమలకు మళ్లీ దుఃఖం పొంగుకొచ్చింది. ఆ దుఃఖంలో అత్తమాట జ్ఞాపకం వచ్చింది. వీళ్లు ఎంతకైనా తగుదురు. పిల్లలు పుట్టడం లేదని ఇద్దరూ కలిసి గొంతు పిసికి చంపగలవాళ్లు. కమల గజగజ వణికి పోయింది. ఆమెకు నిలువెల్లా చమట పట్టింది. వీర నారాయణ తొట్రుపడకుండానే గదిలోకి వచ్చాడు. కర్ర అలమారా కిర్రుమంటుండగా తెరిచాడు. బ్రాంది సీసా తీసి గొంతులో నీళ్లు కలుపకుండానే పోసుకున్నాడు.

కమల లేచి బయటకు పరుగెత్తాలనుకున్నది. కాని వీరనారాయణ కళ్లు భయపెడుతున్నాయి.

వీరనారాయణ మంచం దగ్గరికి మెల్లెగానే నడిచాడు. కమల జబ్బపట్టి మంచంలోకి తోశాడు. కమల పెనుగులాడి పరుగెత్తబోయింది. వీరనారాయణ కమలను మంచంలో కుదేసి బలవంతంగా ఆమెమీద పడ్డాడు.

కమల ఏడుస్తుండగానే వీరనారాయణ విజేత లాగా బయటకు నడిచాడు.

కమల చెదిరిన వెంట్రుకలు సరిచేసుకోకుండా అట్లాగే గదిలో నుండి బయటకు వచ్చి కోపం, దుఃఖం మిళితమైన కంఠంతో తిట్టింది. సత్యవతి విస్తుపోయి చూస్తూ నిలుచున్నది...

*

సత్యవతి ఇంటి ముందున గల సిమెంటు గద్దె మీద వత్తులు చేస్తూ కూర్చున్నది. ఇంటి ముందట గల వేపచెట్ల నీడ చల్లగా హాయిగా వుంది. ఆ ఇంటిముందు తప్ప మిగతా ఊరంతా ఎండలో మాడిపోతున్నది. కల్లాల రోజులు కనుక ఊళ్లో మనుషులెవ్వరు లేరు. పెద్దరువాజకు కుడివేపున గల అరుగుమీద ఇంట్లో కమల ఏదో కుట్టుకుంటోంది.

"మందికి మార్నగాలం బుట్ట ఊళ్లె ఒక్క పురుగన్న లేరు," సత్యవతి గొనుగుతుండగానే ఆ దారంట పోతున్న ఒక మనిషిని పిలిచింది.

"రాయమల్లీ ఎటో పోతున్నవేమే ఇగరా!" సత్యవతి.

"అయ్యో మీకెరుక లేదా బాంచెన్," రాయమల్లు ఒళ్లంతా దుమ్ము నిండి వున్నది.

"ఎటో రిబ్బు రిబ్బున పోతన్నవ్?"

"జొన్న బంతి కట్టినమ్. పొద్దుగాల జొండ్లు చెరిగినమ్, బొండా బుసి, కడలు సెరిగి కుప్పవోసెటాల్లకు గీయేల్లయ్యింది."

"ఏ పాటైనదే?"

'దీని నోరు పడిపోను. దీనికి చెప్పుతే కండ్లల్ల నిప్పులు పోసుకుంటది' మనుసులో. "ఇంకా కొలువ లేదు," పైకి.

"గిన్నెండ్లాయె ఎవుసం చేస్తండ్లు అందాజా తెలువదా?"

"ఓ అయిదు గిద్దెలన్న రాలినయి గావచ్చు బాంచెన్".

"ఏడాదిపాటు అయిదు గిద్దెలకే నీ మొగుడు దున్నిండు తియ్యి. ముండా అపద్దం చెప్పుతే అంతే కానియ్యి తియ్యరాదు."

అటిటు చూసి సత్యవతి అసలు సంగతి ఎత్తింది. "ఔనే యాపలకింద పంచాయ జర్గంతన్నారే" ఇంట్లో కోడలుకు వినిపించకూడదనే ఉద్దేశంతో.

రాయమల్లుకు ఎక్కడలేని ఉత్సాహమొచ్చింది. సంకలోని చాటల అంచెలు కిందబెట్టి మరికొంచెం దగ్గరదాకా నడిచి "ఓ నీ బాంచెన్- ఊళ్లె సబ్బండ వర్నాలు, కుంటి గులాపు అంత ఆడనే ఉన్నరు. మీ కిట్టయ్య మందిల మన్నుదిన్న మంజేరుగున్న తీరుగ కూకున్నడు," పెద్ద గొంతుతో.

కమలకూడా ఆసక్తిగా వింటున్నదని సత్యవతికి తెలియదు.

సత్యవతి మరింత గొంతు తగ్గించి గుసగుసగా "ఆ టక్కులమారి ముండున్నదా?"

అదేమి పట్టించుకోకుండా రాయమల్లు, "దాని కొడుకులట పటేలవ్వ ఇద్దరు. జెండలకు జెండలు మంచిగనే ఉన్నరు. కోళ్లు దిని మీసాలు తుడుసుకుంట కూకున్న పిల్లల తీర్గ కూసున్నారు. నువ్వెన్నయిన చెప్పు బాంచెన్ - ఆడిదాని జల్మంత పాపకారి జల్మలేదు. పాలేరోల్లకు గింత జీతమంట వున్నది. కైయికిలి గాళ్లకు గింత కయికిలంట వున్నది. రాత్రి పగలు బండెడు సాకిరి జేసిన ఆడిదాని కట్టానికి ఇలువలేదు. ఆడిదాని బతుకు్క ఆసరలేదు. సత్తెవ్వ- ఆడు తండ్రైయినా, కొడుకైనా, మొగడైనా ఆడిదాని రెక్కలాడెదన్కనే," రాయమల్లు బర్రన చీది కళ్లు తుడుచుకున్నది.

సత్యవతికి కావల్సింది వేదాంతం కాదు. చంద్రమ్మ మీద సానుభూతి తనకు అసలేవద్దు. ముఖం మాడ్చుకుని, "ఆ అయితే దాని కొడుకులు వచ్చిండ్లన్న మాట".

రాయమల్లు తేరుకొని, "నేనచ్చే కన్న ముందు ఏం కొల్లవురం జర్గిందో ఎరుకలే బాంచెన్- కని నేను అచ్చెటాల్లకు- పట్వారి రాంసెద్రం మీ కిట్టయ్య నడిగిండు 'ఔరా! కిట్టా ఇదేమనా కలికాలమారా? పాపమా పచ్చిబూతారా! గిసొటి మారుమానం దునియల ఎక్కడన్న ఉన్నదారా?' అన్నడు. మీ కిట్టయ్య ఒకటనలే, రెండనలే- అయితే కడుపులేమున్నదో పరాత్పరునికే ఎరుక."

“ఏం పంచాయదు? ఆళ్ల బొంద పంచాయదు. సాపు సీద కనిపిస్తనే వుండే- లోకం కనమన్నది - పెంచ మన్నది. మానాయిన ఉండంగనైతే గిన్నిదినాలా? ఆ ముండవలన ఊరు సొచ్చిన్నాడే గొరగొర ఈడ్చుకొచ్చి వీపుమీద బండలెత్తి అడిగెటోల్లు- నియ్యతి తప్పింది,” సత్యవతి రుసరుసలాడుతూ.

‘సొక్కంపూస ఇది చేసిన రంకుపనికి మొగడు ఉరిబెట్టుక సచ్చిండు. బుక్క ఉపేంద్రం సచ్చేదనుక రాత్రి పగలు కానిందా? ఆడు పుటుక్కుమనంగనే నియ్యతి మతికచ్చింది,’ రాయమల్లు లోపల అను కున్నది.

పైకి, “ఏడ నుంచి ఉరికచ్చిందో అవ్వా! నడి మంది కచ్చింది. అదరక బెదరక నిలుసుంది. నాకు బుక్కెడు బువ్వ బెట్టని ఈ దునియల నాకు కొడుకులు లేరు. ఆళ్లు మునిగి ముతమాయమైపోయిండ్లు.” గప్పుడు పెర్క గంగయ్య అందుకొని, ‘అగో గయాప చెట్టు మొదట్లో కూసున్న ఇద్దరు నీ కొడుకులు కాదం టవా,’ అంట అడిగిండవ్వా! ‘ఏది నా ముంగటికచ్చి మాట్లాడుమను... పెటపెటమాడుతంటే- నన్ను తన్ని ఎల్లగొట్టిండ్లు - ఆళ్లు నా కొడుకులా?’ అన్నది.

“ఇక సూస్కో అక్కడ కూసున్నోళ్లంత గెబ్బెన లేసిండ్లు. ఆ అవ్వ మాత్రం ఉలుకలే పలుకలే.”

“మీ పటేలేం జేతండే. సుంకరోన్ని బిలిసి దవుడ లొత్తియ్యక,” సత్యవతి.

“మళ్ల గంగన్నే అడిగిండవ్వా! ‘ఊకే కొలువా కుమ్మరియ్య! సెంద్రమ్మా నీకిది బనావుగాదు. లోకంల ఎన్ని కొట్లాటలు జర్గుతలేవు. నీ కొడుకులు ఏం బెట్టిండ్లో- నువ్వేం తిన్నవో మాకెరక లేదు. మీ వూల్లె కనిపెంచినోళ్లున్నరు... నలుగురున్నకాడ నారాయి డున్నడంటరు. నీ కొడుకులు నీకు తిండి పెట్టలేదంటే నలుగుట్ల బెట్టనుంటివి. వాళ్ల ముక్కు భూమికి రాకించ నుంటివి. ఊరెల్లినవనుకో- మించిపోయిందేమి లేదు. ఇంటింటికి మట్టిపోయ్యేగని మాకు పొయ్యిలేదు. సంసారమన్నంక సవాలచ్చ కొట్లాటలుంటాయి. నీ జాగల నువ్వు పోరాదా?’

“నీ బాంచెన్ ఇగట్ల లేసింది. ‘నువ్వు మొగోనివై నా కడుపుకోత నువ్వేరుగవు. నువ్వు ఆడిదానివై పుట్టి నా తీరు అనుభగిత్తె తెలుత్తది. ఇగో అందరు ఇనుండ్లి. నేను కిట్టయ్యను మారువానం జేసుకున్న.’

“ఇగ జూస్కో పటెలవ్వా మందికి నోల్లు పడి పోయినయ్. కొడుకులు తల కొట్టేసినట్టయి నేల కంచు కున్నరు. అప్పుడడిగిండు బాంచెన్ గంగయ్య, ‘ఔరా కిట్టా నువ్వేమంటవ్.’

“కిట్టయ్య ఎవల మొకం సూడకుంటనే- ‘నేనే మనాలె చెప్పుతంది గదా.’

“అప్పుడు బాంచెన్ పట్వారి రాంచంద్రం నర్సి మ్మావతారం ఎత్తిండు బాంచెన్. ‘సూత్తరేంర లంజెను కట్టేయిండ్లి’ అన్నడు పండ్లు పటపట కొరుక్కుంట.

“సుంకరోల్లు పటెలు దిక్కు సూసిండ్లు. మన పటేలు ఎందుకనో ఏం మాట్లాడలేదు. తన్నుండ్లి, గుద్దుండ్లి అన్నరు మొగోల్లు- దాని కొడుకులు తెలివి తెచ్చుకొని దాన్ని రెట్టలు బట్టుకున్నరు. ఫెడీఫెడిన కొట్ట బట్టిండ్లు. అయి దెబ్బలుగాదు సత్తెవ్వా! నా అసోటి దాన్నైతే ఆన్నే పానమిడుత్తు. ఆళ్లు కొడుకులుగాదు సత్తెవ్వా! పాపకర్ములు. అంతదాక చిర్రుమీదున్నది- వాళ్లిద్దరు గొర్రగొర్ర గుంజుక పోబట్టిండ్లు. ఆ తల్లి కాకి సోకం బెట్టింది. అవ్వా! నా కడుపు అవిసిపోయింది. ఎవలు సప్పుడు చెయ్యలే.

“అప్పుడు పటేలవ్వా, కిట్టయ్య దేవుడు బూని నోని తీర్గ లేసిండు బాంచెన్- ఉరికి ఆళ్లిద్దర్ని ఎటోల్ల నటు దొబ్బేసిండు బాంచెన్.

“అప్పుడు మీ కులపోల్లు గొల్లున లేసిండ్లు బాంచెన్. కుల తప్పన్నరు. అగ్గి నీళ్లు బందన్నరు.

“కిట్టయ్య నడిమందిల నిలుసుండి పటేలుకెళ్లి చూసిండ్లు బాంచెన్- లోక రివాజు తప్పదన్నట్టు పటేలు సప్పుడు చెయ్యలే బాంచెన్.

“అప్పుడు కిట్టయ్య ‘ఇగో నాకు గీ ఊళ్లె బువ్వ లేనప్పుడు కులముండి ఏంజేత్తది. నాకు కులమద్దు మీరే ఉంచుకోండ్లి.’ అవ్వా కట్టుబట్టలతోని, కడుపు కాలిన సెంద్రమ్మను ఎంటబెట్టుకొని ఉత్తరం బాజు కోయ, గొండ రాజ్జెంకెళ్లి ఎల్లిపోయిండు బాంచెన్.”

సత్యవతికి నోటమాట రాలేదు. ఆమె ఈ పరిణా మాన్ని ఊహించలేదు. ఖిన్నురాలై అట్లాగే కూర్చున్నది. ఆమెకెందుకో తనే ఓడిపోయినంత బాధ కలిగింది. ఇలాంటి వ్యతిరేక భావం ఎందుకు కలిగిందో తెలియదు. రాయమల్లు కాళ్లీడుస్తూ వెళ్లిపోయింది.

భూములు జాగలు పోయి బతుకలేక ఊరెల్లి పోయిన వాళ్లనెరుగును సత్యవతి. వాళ్లు ఓడిపోయి పోయారు. ఊరును ధిక్కరించి అదీ తన కుటుంబపు పోలీసు పటేల్ అధికారాన్ని ధిక్కరించి, ఒక్క ఆడదాని కోసం ఊరెల్లిపోయాడు... ఇది తనకేమీ సంబంధం లేని సంగతే. కాని తను పుట్టి పెరిగి- ఆ గిరిలో పెనుగులాడి రూపొందించుకున్న అహానికి దెబ్బ తాకింది.

కమలకు చెప్పరానంత సంతోషం కలిగింది... సత్యవతిలాగే కమల సంతోషానికి ఆమెకు కారణం తెలియదు.

*

ఓ మాదిరి పట్టణంలోని ఒక బిల్డింగ్‌లో కమల పచారు చేస్తోంది. చల్లటి గచ్చునేల. గిరగిర తిరుగుతున్న పంఖా గాలి అన్నీ, కమలకు అలవాటయ్యాయి. ఇల్లు నిశ్శబ్దంగా వున్నది. తలా, కాళ్లు లేని ఆలోచనలు కమలను సదా తొలుస్తూనే వుంటాయి.

వీరనారాయణ నెరిసిన వెంట్రుకలు ఆమెకు పదేపదే గుర్తొస్తున్నాయి.

'కమిలీ నువ్విక్కడే ఊరు, పేరు లేకుండా చస్తావు,' తనలో తనే అనుకున్నది. ఆలోచనలను దూరం కొట్టడానికి ఒక గదిలో నుంచి మరొక గదిలోకి ఊరికనే తిరిగింది... వరండాలో అత్త సత్యవతి ఫోటో ఎందుకనో విచారంగా, దిగులుగా తోచింది. 'అత్త మాత్రం ఈ కుటుంబంలో ఏ సుఖం పొందింది,' అనుకున్నది. సత్యవతి మీద జాలి కనులకు కొత్తగా, వింతగా తోచింది.

అక్కడే కుర్చీలో కూర్చున్నది. వొకటొకటే అనేక జ్ఞాపకాలు ఆమెను చుట్టుముట్టాయి. ఆ జ్ఞాపకాలు ఒకప్పుడు తాము జీవించిన ఊరి మీదికి మళ్లాయి. ఆ జ్ఞాపకాల మధ్య కిష్టయ్య గుర్తొచ్చాడు. ఎంత జ్ఞాపకం చేసుకున్నా చంద్రమ్మ ముఖం మాత్రం గుర్తుకు రాలేదు.

ఒక్కొక్క జ్ఞాపకాన్ని ప్రోది చేసుకొన్నది. కిష్టయ్యను తను ఆఖరుసారి చూడడం పదిహేనేళ్ల క్రితం.

ఈ పదిహేను సంవత్సరాలు ఊపిరి తీసుకోవడానికి కూడా వీలుకానంత వేగవంతమయ్యింది. కిష్టయ్య ఊళ్లో నుండి వెళ్లిపోయిన మరుసటి సంవత్సరం వానాకాలం మొదలయ్యింది గొడవలతో. ఆ గొడవలన్నీ కమలకు తెలియదు. కాని వీరనారాయణ దెబ్బతిన్న పులిలా ఇంట్లో గురగురలాడేవాడు. పాలేర్లు పనులు బందు పెట్టారు. నాట్లప్పుడు కూలి పెరుగాలన్నారు. ఆ గొడవలన్నీ ఒకటి అరా వీరనారాయణ తిట్లద్వారా తెలిసేది. వీరనారాయణ తన ప్రయత్నం తను చేశాడు. తన కులస్థులను అయిదారుగురిని చేరదీసి తాగబోయించాడు. తుపాకి రోజూ తుడిచేవాడు. ఊళ్లో పెద్దలు తమ ఇంట్లో రాత్రుల్లు గుసగుసలాడేవారు.

ఈ గొడవలిట్లా జరగుతుండగానే వీరనారాయణ అయిదెకరాల వరి పొలం ఊరి మాదుగులు కోసుకపోయారు. పదెకరాల పెసర చేను పశువుల మేపారు. ఊరు ఊరంతా ఒక్కటయ్యింది. ఒక్క వూరే కాదు అన్ని ఊళ్లు కలిసిపోయాయి... వీరనారాయణ ఇంట్లోని తుపాకి ఎత్తుకపోయారు. వీరనారాయణ ఈ సుడిగాలిలో ఎంత నిలదొక్కుకున్నా నిలబడలేకపోయాడు. పోలీసులు ఊళ్లోకి వచ్చారు.

కమలకు తాము ఊరు విడిచి ఈ పట్నం వచ్చే రోజు గుర్తొచ్చింది. వీరనారాయణ ఆ రాత్రి నిదుర పోలేదు- సత్యవతి నిదురపోలేదు. సత్యవతి కిష్టయ్య దొంగల నాయకుడని తిట్టిపోసింది. తన కుటుంబం మీద పగ తీర్చుకుంటున్నాడన్నది. శాపనార్థాలు పెట్టింది.

చీకటి చీకటి వుండగానే జీబులో వచ్చారు. సత్యవతి గింజుకున్నది. ఏమన్నాకాని తనక్కడే వుండిపోతానన్నది.

కమలకు ఆ తరువాత అంతా అలుక్కుపోయినట్టుగా ఏదీ గుర్తుకురాలేదు.

వీరనారాయణ గుంటలో నుండి చెరువులో పడ్డ చేపలాగా అయ్యాడు. వతన్లు పోయాయి. కొత్త రాజకీయాలు రంగం మీదికి వచ్చాయి. వీరనారాయణ పసుపుపచ్చ బట్టల్లోకి మారాడు. బంగారురంగు ఫ్రేము అద్దాలు, అదివరకే వున్న బంగారం, వెండి అమ్మి ఈ బిల్డింగ్ కొన్నాడు. మోటార్ సైకిల్ కొన్నాడు. సారా కంట్రాక్టులో చాలా సంపాదించాడు. పది సంవత్సరాలు తిరక్కుండానే ఆ మండలానికి అధ్యక్షుడయ్యాడు.

కమలకు ఈ గొడవలన్నీ తెలియవు. ఊరితో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. ఈ వాతావరణంలో ఇమడలేక సత్యవతి సంవత్సరం తిరగకుండానే చనిపోయింది. ఇక్కడి వాతావరణం ఏమిటో కమలకు అర్థం కాలేదు.

కమల ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ పై అంతస్థుకు చేరుకున్నది. మేడ బాల్కనీలో నిలబడితే వీధిలో వెళ్లేవాళ్లు కన్పిస్తున్నారు.

అప్పుడు సాయంత్రం అయిదు గంటలు కావస్తున్నది. స్కూళ్ల నుంచి పిల్లలు వీపుల మీద పుస్తకాలు మోస్తూ పోతున్నారు. ఆ లేత ముఖాలు చూసేసరికి తనకింక పిల్లలు పుట్టరు... ఈ విసుగు మరిచిపోవడానికి ఆ భాగ్యం లేకుండా పోయింది. కొద్దిగా గాలి తోలుతోంది. అనేక ఇండ్ల వరుసల మీద మబ్బుతునకలు వేలాడుతున్నాయి.

బస్సొకటి డబడబలాడుతూ వెళ్లిపోయింది. ఆటోలు, స్కూటర్లు పోటీపడి పరుగెత్తుతున్నాయి. రోడ్డు మీద పీక్కుపోయిన ముఖాలవాళ్లు, బొజ్జలవాళ్లు, సైకిల్లు, ఆటోలు, రిక్షాలు, స్కూటర్లు - అరటిపండ్లు, నవ్వులు, మాటలు - ఎవరికి ఎవరు పట్టనట్టు ఎటెటో పోతున్నారు.

కమలకు తమ ఊరు మళ్లీ మెరిసింది. ఉదయాలు, సాయంత్రాలు, పంట పొలాలు, పశువుల అరుపులు, పంచాయదులు, పెళ్లిల్లు అన్నీ గుర్తొచ్చాయి. మళ్లీ కిష్టయ్య గుర్తొచ్చాడు.

కిష్టయ్య ఊరి వాళ్లందరిని వెంటేసుకుని ఏదో అరుస్తున్నట్టు రూపుకట్టింది. చంద్రమ్మ కూడ- చంద్రమ్మ ఇంకా బతికున్నదా? కిష్టయ్య ఏమి చేస్తుంటాడు?

కమల కెందుకో మనసంతా తిమ్మిరెక్కినట్లుగా అన్పించింది. గాలి హెచ్చింది. చిటపట చినుకులు ప్రారంభమయ్యేసరికి కమల కళ్లు తెరిచింది. అప్పటికే వీథిలో లైట్లు వెలిగాయి.

కమలకు వంటపని, ఇంటిపని లేదు. అన్నిటికి మనుషులున్నారు. లేచి ఒళ్లు విరుచుకున్నది.

ఇంటి ముందు జీబు ఆగింది. అందులో నుండి గుండ్రటి ముఖం గన్‌మెన్ దునికిండు. అతని వెంటనే వీరనారాయణ దిగాడు. అతను ఎప్పటిలాగే నల్లగా, సన్నగా వున్నాడు. కమల తనకేసి చూసుకున్నది. కమల గుర్తుపట్టరానంత ఒళ్లు చేసింది.

పసుపుపచ్చ బట్టలేసుకున్న మరో నలుగురు దిగారు. వాళ్లందరు కమలకు పరిచితమే... ఎప్పుడు వచ్చేవాళ్లే- వాళ్లు ఏం చేస్తారో కమలకు జ్ఞాపకం లేదు.

కమల నిట్టూర్చి గదిలో కొచ్చేసరికి కింది గదిలో నవ్వులు విన్పిస్తున్నాయి. వంటమనిషి ముత్తయ్య విసుక్కుంటూ వంటింట్లోకి వెళ్లాడు. కమల చేసేదేమిలేక పడకగదిలోకి నడిచింది.

కింద నవ్వులు అంతకంతకు హెచ్చాయి. సీసాలు, కోళ్లు ఏదో జరిగి వుంటుందనుకున్నది.

కమల ఏమీ తినకుండానే మంచం మీద ఒరిగిపోయింది. ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు.

ఎవరో గబగబ ఉరికి వచ్చిన చప్పుడై కమల హఠాత్తుగా లేచి కూర్చున్నది. అప్పుడు టైమెంతయ్యిందో తెలియదు.

వీరనారాయణ ఒళ్లంతా చెమట కారుతుండగా పడకగదిలోకి వచ్చి తలుపు వేయరాక బాగా తాగున్నాడేమో తలుపు దగ్గరే పడిపోయాడు.

అతని వెనుకనే ఇద్దరు ఇరవైకి ముప్పయికి మధ్యన వయసు గలవాళ్లు పరుగెత్తుకొచ్చారు. వాళ్ల చేతుల్లో నాటు తుపాకులున్నాయి.

కమల నిద్ర వదిలిపోయింది.

వాళ్లిద్దరు వణికే వీరనారాయణను లేపి, పట్టుకున్నారు. అతని లాగు తడిసిపోయింది.

ఇంతలో మరో అతను గన్‌మెన్ చేతులు కట్టి తీసుకొచ్చాడు. కమల దిగ్భ్రాంతి నుండి తేరుకోలేదు.

వాళ్లు గబగబ టెలిఫోను తీగెలు కత్తిరించారు. ఒకరు వీరనారాయణ ఛాతి మీద తుపాకి గురిపెట్టి వరండాలోకి నడిపించుకు పోయారు. గన్‌మెన్ ఏడుస్తూ ఏదో అంటున్నాడు.

మూడో వ్యక్తి గదులన్నీ వెతుకుతున్నాడు. ఒకరు వెళ్లి గదులన్నీ వెతికి వీరనారాయణ పిస్టల్ తీసుకు వచ్చాడు. ఇతర వస్తువులేమీ ముట్టుకోలేదు.

కమల గబగబ మూడో వ్యక్తి దగ్గరికి రాబోయింది.

గన్‌మెన్‌ను, వీరనారాయణను ఇద్దరు మేడ కిందకి నడిపించుకుపోయారు.

మూడో వ్యక్తి కమల దగ్గరికి వచ్చి, "నీ భర్తను తీసుకుపోతున్నాం. ఏమి చెయ్యం. నీ భర్త మా కామ్రేడ్ కిష్టయ్యను అరెస్టు చేయించాడు. నువ్వు రేపు ఉదయం పోలీసులకు చెప్పు- మా కామ్రేడ్‌ను క్షేమంగా వొదిలిపెడితే మండలాధ్యక్షున్ని ఒదిలి పెడుతాం."

కమల ఏదో అడుగాలని నోరు తెరిచింది.

మూడో వ్యక్తి కమలను పడకగదిలోకి తోసి బయటి నుండి గొళ్లెం పెట్టాడు. క్రింద జీబు వెళ్లిపోయిన చప్పుడు.

అంతా అయిదు నిముషాలలోనే ముగిసిపోయింది. కమలకు అది కలో నిజమో కూడ తెలియడం లేదు. లేచి తలుపు తట్టి చూసింది. అంతా నిజమే.

నిజమే అయితే... ఏం జరిగింది? తన భర్త... భర్తేనా? వీరనారాయణను ఎత్తుకపోయారు. కిష్టయ్య... ఎడ్డి కిష్టయ్యను పోలీసులు పట్టుకున్నారా?

ఈ గొడవ ఎప్పటినుండి జరుగుతోంది?

వీరనారాయణ ఔనన్నా కాదన్నా తన భర్త. ఒక పక్షంలో నిలుచున్నాడు. అవతలి పక్షంలో కిష్టయ్య నిలుచున్నాడు. వీరనారాయణ చుట్టూ, పోలీసులు, జీబులు, డబ్బు వున్నాయి. కిష్టయ్య చుట్టూ ఇపుడు తమ ఊరివాళ్లతోపాటు అన్ని ఊళ్లవాళ్లు నిలుచున్నారు.

తనే పక్షం వహించాలి? ఎవరికి చెప్పాలి?

తను బురదలో వున్నట్టా? గాలిలో, ఆకాశంలోకి వికసిస్తున్నట్లా? కమలకు అర్థం కాలేదు.

కమల మాత్రం తన పడకగదిలోనే బందీయై వున్నది. తెల్లారాలి. ఎవరో వచ్చి విముక్తం చేయాలి?

*ఆంధ్రజ్యోతి, దీపావళి ప్రత్యేక సంచిక, 1991*